సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 12 । నవంబర్ । 2024



ఊపిరితిత్తులు జాగ్రత్త..!
నిమోనియా(నిమ్ము) వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే మృత్యువాతపడే ప్రమాదముంది. నిమోనియాని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా బయట పడవచ్చు. - 8లో



వాలీబాల్ విజేతలు కడప, శ్రీకాకుళం
భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా సాగిన బాల, బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో కడప, శ్రీకాకుళం జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. - 8లో

డీఎంహెచ్ఓ విచారణ
చీపురుపల్లి: పట్టణంలోని బాబూజీ ఆస్పత్రిలో ఈ నెల 7న ఓ గర్భిణి ప్రసవ సమయంలో బిడ్డ మృతి చెందిన ఘటనపై జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.రాణి సోమవారం విచారణ జరిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్పత్రిని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. వైద్యులందరితో మాట్లాడి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆమె తెలిపారు.

న్యూస్‌రీల్

ఐటీడీఏ పరిపాలనాధికారిగా సునీల్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిపాలనాధికారిగా వి.సునీల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ట్రైబల్ కల్చర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (విజయవాడ) సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

గుంప సోమేశ్వరుని దర్శించిన కలెక్టర్



గుంప సోమేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

కొమరాడ: మండలంలోని కోటిపాం పంచాయతీ దేవుని గుంపలో నాగావళి, జంఝావతి నదుల సంగమంలో వెలిసిన గుంప సోమేశ్వర ఆలయాన్ని కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు కలెక్టర్‌తో నిర్వహించారు. తరువాత ఆలయం విశిష్టత గురించి అర్చకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం కోటిపాం సర్పంచ్ సుంకరి సుగుణ దంపతులు ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి పంపించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

15న మెళియాపుట్టిలో జన జాతీయ గౌరవ దివస్



మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలో నూతనంగా నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈనెల 15న జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఏపీఓ చిన్నబాబు, ఇంజినీరింగ్ డీఈ సింహాచలం, డీడీ అన్నదొర తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

టీడీపీ కూటమి ప్రభుత్వ తొలి బడ్జెట్...

సూపర్ చీట్!



- సంక్షేమం, సుపరిపాలనను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్
- గతం కన్నా సంక్షేమ పథకాలకు భారీగా కోత
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అరకొరగా నిధులు
- తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు పనులకు రూ.32.84 కోట్లు
- తారక రామతీర్థ సాగరం ప్రాజెక్టుకు రూ.28 కోట్లు
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.63 కోట్లు
- తీవ్రంగా నిరాశపరచిన బడ్జెట్‌పై సర్వత్రా అసంతృప్తి



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఐదు నెలల అలస్యంగా ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో కేటాయింపులు నీటిబుడగలైపోయాయి. ప్రజా సంక్షేమానికి కేటాయింపులు నేతిబీరలో నేతి చందమే అయ్యాయి. సూపర్ సిక్స్ అంటూ ఇన్నాళ్లూ ఊరించి తీరా బడ్జెట్ కేటాయింపుల విషయానికి వచ్చేసరికి చేతులెత్తేశారు. మేనిఫెస్టోను భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా భావిస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లు ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పోలిస్తే ఇప్పుడు మూడు పార్టీల కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ కంటితుడుపు మాదిరిగానే ఉందనే విమర్శలు అన్నివర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. శాసనసభలో సోమవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్, వ్యవసాయ బడ్జెట్‌పై జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు.

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఉమ్మడి విజయనగరం జిల్లాలో జలయజ్ఞంలో భాగంగా తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టు పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా ఆయన కుమారుడు, గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయిస్తూ వచ్చారు. అదే పంథాను కొనసాగించడంలో చంద్రబాబు ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపించలేదని ఈ బడ్జెట్‌ను చూస్తే తేటతెల్లమవుతోంది. గతంలో రాష్ట్ర విభజన తర్వాత 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కూడా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేసిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు 4.0 ప్రభుత్వంలో కూడా అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది.

మూడు పార్టీలు కలిసినా తీరని అన్యాయం




ఒక్కటిగా అధికారం చేపట్టిన మా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమ బడ్జెట్ ఎలా ఉండాలో అమలుచేసి చూపించింది. కరోనా మహమ్మారి విజృంభించిన విపత్కర సమయంలోనూ ప్రజాసంక్షేమాన్ని విస్మరించలేదు. ఉత్తరాంధ్రకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. అంతకన్నా ఎక్కువగా సంక్షేమ పథకాలు ఇస్తామని, సూపర్ సిక్స్ అని ప్రజలను ఊరించి అధికారంలోకి వచ్చిన మూడు పార్టీల కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టేసరికి క్లీన్ బౌల్డ్ అయిపోయింది. మూడు పార్టీలు కలిసి ఏదో చేస్తాయని ఆశించిన ప్రజలకు తీరని అన్యాయమే చేశాయి. ఉత్తరాంధ్రకు ఉత్తచేతులు చూపించాయి. ప్రజా సంక్షేమమే కాదు రైతు సంక్షేమాన్నీ విస్మరించాయి. అన్ని విధాలా వెనుకబడిన ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి ప్రత్యేక కేటాయింపులు కొరవడ్డాయి.
– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్

'తోటపల్లి'పై మళ్లీ చిన్నచూపు



వై.ఎస్.రాజశేఖరరెడ్డి తలపెట్టిన తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని పనులు మిగిలిపోయాయి. వాటిని పూర్తి చేయడానికి వీలుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021–22 బడ్జెట్‌లో రూ.189.70 కోట్లు, 2022–23 బడ్జెట్‌లో రూ.126.61 కోట్లు, 2023–24 బడ్జెట్‌లో రూ.80.84 కోట్లు కేటాయించింది. వాస్తవానికి తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు లక్ష్యం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో 1,95,221 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనేది. మొత్తం కొత్త కుడి ప్రధాన కాలువ, బ్రాంచ్ కాలువల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రెండేళ్ల కిందట రూ.59.58 కోట్లతో పార్వతీపురం డివిజన్ పరిధిలోను, రూ.63.63 కోట్లతో రాజాం డివిజన్ పరిధిలో బ్యాలెన్స్ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. కానీ ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. 2024–25 బడ్జెట్లో కేవలం రూ.32.84 కోట్లు మాత్రమే కేటాయించింది.

తారక రామతీర్థ సాగరంపై నిర్లక్ష్యం...



పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లోని రైతులకు సాగునీరు, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలనేది తారక రామతీర్థ సాగరం ప్రాజెక్టు లక్ష్యం. 2006 సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత కాలంలో టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను కొనసాగించడంపై నిర్లక్ష్యం చేసింది. 2019లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాతే నిధులు కేటాయింపు మొదలైంది. 2021–22లో రూ.201 కోట్లు, 2022–23లో రూ.124.50 కోట్లు కేటాయించారు. పునరావాసానికి అవసరమైన రూ.90 కోట్ల నిధులను విడుదల చేసిన సంగతి తెలిసిందే. 2023–24 బడ్జెట్‌లో రూ.50 కోట్లు ప్రాజెక్టు మిగులు పనులను పూర్తి చేయడానికి కేటాయించారు. ఈ ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేసి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన నీటిని కూడా సరఫరా చేయాలని యోచిస్తున్నా ఇప్పుడీ కూటమి ప్రభుత్వ బడ్జెట్లో అరకొరగానే నిధులు కేటాయించడం గమనార్హం. కేవలం రూ.28 కోట్లతోనే సరిపెట్టారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఉత్తచేతులే...

గోదావరి మిగులు జలాలను పోలవరం కాలువ ద్వారా తీసుకొచ్చి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయడానికి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి తలపెట్టినదే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు. జిల్లాలో దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది దీని లక్ష్యం. 2021–22లో రూ.79.95 కోట్లను, 2022–23లో రూ.297.50 కోట్లు కేటాయించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023–24 బడ్జెట్లో కూడా రూ.141.79 కోట్లను కేటాయించింది. కానీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు కేవలం రూ.63 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది.

రైతులకు ప్రయోజనమేది?



గత ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేసింది. ఏటా రూ.13,500 రైతు భరోసా నగదు వచ్చేది. ఈ సాయం వ్యవసాయ పనుల పెట్టుబడులకు బాగా ఉపయోగపడేది. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి, రైతుల పంట పొలాలు నుంచి నేరుగా కొనుగోలు కేంద్రాలకు చేరేవి. ఎక్కడా దళారీవ్యవస్థ ఉండేది కాదు. ఇప్పుడంతా అస్తవ్యస్తంగా ఉంది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నుంచి పైసా కూడా రైతు సాయం అందలేదు. ఇప్పుడు బడ్జెట్‌లో కూడా వ్యవసాయానికి పెద్దగా నిధులు కేటాయించలేదు. రైతు భరోసా ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్నారు. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. క్రాప్ ఇన్సూరెన్స్, పశువుల బీమా, పంటల బీమా పథకాలు కనిపించడం లేదు.
– జివర నారన్నాయుడు, రైతు, వన్నలి గ్రామం, రేగిడి మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వనట్టేనా..?



టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు గడిచింది. కొత్తగా ఉద్యోగాల ప్రకటనలు లేవు. ఇస్తామన్న డీఎస్సీకి ఇంతవరకూ అతీగతీ లేదు. నిరుద్యోగ భృతి పథకం మళ్లీ అటకెక్కించేసినట్లే ఉంది. బడ్జెట్‌లో కూడా ప్రస్తావన లేదు.
– గార శ్రీకాంత్, మందరాడ, సంతకవిటి మండలం

ఇంత పేలవమైన బడ్జెట్టా?



ఇంత పేలవమైన బడ్జెట్ టీడీపీ కూటమి ప్రభుత్వానికే చెల్లింది. ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్‌కు సంబంధించి అధికారంలోకి వచ్చాక అమలు ప్రశ్నార్థకమేనని ఈ బడ్జెట్‌తో తేటతెల్లమైంది. జలవనరుల శాఖ పరిధిలో అభివృద్ధికి సంబంధించిన కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సాంకేతికపరంగా నాలుగు నెలలకు సంబంధించి జరపాల్సిన కేటాయింపులకు బదులు ఏడాదికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రతిపాదించడం లోపభూయిష్టమని చెప్పవచ్చు.
– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ, పాలకొండ

స్పష్టతలేని బడ్జెట్



రాష్ట్రంలో అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు ఎంతెంత కేటాయింపులు చేస్తారో స్పష్టత లేకుండా ఏపీ బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. అన్నదాత సుఖీభవ పథకానికి బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.వెయ్యి కోట్లే కేటాయించడం దారుణం. ఎంత మంది రైతులకు ఈ పథకం వర్తింపజేయనున్నారనే విషయాన్ని చెప్పకుండా రైతులను కూటమి ప్రభుత్వం మరోసారి మోసగిస్తోంది.
– విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే

పేదలను విస్మరించిన బడ్జెట్



కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలను పూర్తిగా విస్మరించినట్లుగా ఉంది. సంక్షేమ పథకాలను గాలికి వదిలేసిన బడ్జెట్ ఇది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమాన్ని పట్టించుకోకుండా కేవలం తూతూమంత్రంగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏమిటనే ప్రస్తావించలేదు. విద్యారంగాన్ని పట్టించుకోకుండా విద్యారంగ సంక్షేమ పథకాల ఊసలేదు. ఈ బడ్జెట్ వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదు.
– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

సూపర్ సిక్స్ అమల్లో క్లీన్ బౌల్డ్



కూటమి పార్టీలు సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ఊదరగొట్టాయి. అమల్లో మాత్రం క్లీన్ బౌల్డ్ అయ్యాయి. అతి తక్కువ కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. అందుకే ప్రజల దృష్టి మరలించడానికి సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెడుతున్నారు. అంతేతప్ప బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాల అమలుకు తగినరీతిలో నిధుల కేటాయింపు కనిపించట్లేదు.
–కె.రమేష్‌నాయుడు, గుచ్చిమి, గజపతినగరం

అంకెల గారడీనే అమలు చేస్తారా?



వ్యవసాయ బడ్జెట్‌కు సంబంధించి కూటమి ప్రభుత్వం వెల్లడించిన నిధులు కేవలం అంకెల గారడీనే. వాటిని ఎలా అమలు చేస్తారా అన్నది వేచిచూడాలి. గతంలోనూ టీడీపీ రైతులకు అనేక హామీలు ఇచ్చింది. వాటి అమలు అంతంతమాత్రంగానే ఉండేది. రైతుకు పెట్టుబడి సాయంగా రూ.20వేల వంతున ఇస్తామన్నారు. అందుకు సంబంధించిన నిధులు బడ్జెట్‌లో లేవు. రూ. 3లక్షల రుణానికి పావలా వడ్డీ అంటున్నారు. రైతులకు నమ్మకం కలగడం లేదు. రూ.16వేల కోట్ల పైబడి జలవనరుల అభివృద్ధికి కేటాయిస్తామన్నారు. అందులో తోటపల్లికి రూ.32.84 కోట్లే కేటాయించారు. మరి ఆధునీకరణ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.
– కండాపు ప్రసాదరావు, అభ్యుదయ రైతు, పాలకొండ

ఇది 'సూపర్ చీట్స్'బడ్జెట్



అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ 'సూపర్ చీట్స్..బడ్జెట్'. తొలి బడ్జెట్‌లోనే చంద్రబాబు మహిళలను మరోసారి మోసం చేశారు. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18వేలు ఇస్తాం అనిచెప్పి తీరా బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోవడం మోసం కాదా? రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని యువతకు చెప్పి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దగా కాదా? మహిళలకి ఉచిత బస్సు పథకం మోసం కాదా? తల్లికి వందనం పథకానికి నిధులు సగానికిపైగా కోత పెట్టడం అన్యాయం కాదా? ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం అని ఈ ఏడాదికి 2 సిలిండర్లను ఎగనామం పెట్టడం మోసం కాదా? 50 ఏళ్లకే మహిళలకు పెన్షన్లు ఇస్తాం అన్నారు. ఏది ఈ బడ్జెట్‌లో ఆ ప్రస్తావన? రైతులకు రూ.20 వేలు ఏడాదికి పెట్టుబడి సాయం ఇస్తాం అన్నారు. అందుకు రూ.10వేలు కోట్లు ఇవ్వాల్సింది. రూ.4,500 కోట్లే ఇవ్వడం రైతులను మోసంచేయడం కాదా?
– పాముల పుష్పశ్రీవాణి, మాజీ డిప్యూటీ సీఎం, కురుపాం

రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కరుణ

- వైద్యారోగ్య శాఖ కమిషనర్ కరుణ

పార్వతీపురం: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మరింత నాణ్యమైన వైద్యసేవలను అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ వైద్యులకు సూచించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యులతో సమీక్షా సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, మందులు, పరికరాలు, సిబ్బంది తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న సేవలను పరిశీలించేందుకు 13 బృందాలకు రప్పించినట్లు తెలిపారు. జిల్లా ప్రజలకు మరింత నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. ఆస్పత్రుల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించి జిల్లాలో ఆరోగ్య రంగంలో మరింత సమర్థవంతమైన సేవలను అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

వైద్య సేవల మెరుగుకు చర్యలు

సమావేశంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన జిల్లా కావడం, గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉండడం కారణంగా పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు అందడం లేదన్నారు. జిల్లాలో రక్తహీనత లోపం ఎక్కువగా ఉందని దీని నివారణకు వైద్యసిబ్బందిని ఏర్పాటుచేసి పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. 108 అంబులెన్స్‌ల ద్వారా అత్యసర పరిస్థితిలో రోగులను విజయనగరం, విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు మరిన్ని ఫీడర్ అంబులెన్స్‌లు, 108 వాహనాలు అవసరమని పేర్కొన్నారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో పడకలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్‌లు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఎంహెచ్ఓ విజయపార్వతి, వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి ఎం.వినోద్ కుమార్, ఏరియా ఆస్పత్రి, ప్రాథమిక, సామాజిక ఆస్పత్రుల మెడికల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో సేవలందించాలి

పార్వతీపురంటౌన్: పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో సేవలందించాలని వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని బందలుప్పి పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన పనితీరు కనబరచాలని ఆదేశించారు. అనంతరం పరికరాలు, రికార్డులు, రిపోర్టును నిశితంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ భవనాల నిర్మాణం, మందుల నిల్వ గదులు, రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. అనంత రం రికార్డులు, వైద్య సిబ్బంది వివరాలు, పరి సరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పీహెచ్‌సీ లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయవలసిన పనులపై సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హెచ్‌డబ్ల్యూసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డీఐఓ డాక్టర్ నారాయణ, కన్సల్టెంట్ డాక్టర్ కె.గంగాధర్, వైద్యాధికారులు హరికృష్ణ, నిఖిల, కిరణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే అత్యున్నత స్థాయి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: విద్యతోనే అత్యున్నత స్థాయికి చేరుకోగలమని గుర్తించిన మహోన్నత వ్యక్తి మౌలానా అబుల్ కలామ్ అజాద్ అని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆజాద్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో చదువుకున్న వ్యక్తికి ఎంతో గుర్తింపు ఉందన్నారు. అందుకు భారత తొలి విద్యాశాఖామంత్రిగా పనిచేసిన అబుల్‌కలామ్ ఆజాద్ విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. విద్యకోసం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, దేశంలో అత్యున్నతమైన ఐఐటీని ఖరగ్‌పూర్‌లో ఏర్పాటు చేశారని చెప్పారు. ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులకు చదువుతోపాటు నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆజాద్ భావాలను ఆదర్శంగా తీసుకుని అందరూ నడుచుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

గుడ్లు, పాలు, పండ్లు ఇవ్వడం లేదు

- మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణికి గోడు వినిపించిన గర్భిణులు



గుమ్మలక్ష్మీపురం వైటీసీలో గర్భిణులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: గిరిశిఖర గ్రామాల నుంచి అత్యవసర వేళ ఆస్పత్రికి చేరుకోలేమన్న ఉద్దేశంతో గుమ్మలక్ష్మీపురం వైటీసీలోని గర్భిణుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్నాం.. ఇక్కడ మెనూ సక్రమంగా అమలుచేయడం లేదు.. గుడ్లు, పాలు, పండ్లు, స్వీట్లు ఇవ్వడం లేదంటూ పలువురు గర్భిణులు మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి వద్ద వాపోయారు. గర్భిణుల వసతి గృహాన్ని సోమవారం సందర్శించిన మాజీ డిప్యూటీ సీఎంకు గోడు వినిపించారు. దీనిపై పుష్పశ్రీవాణి స్పందిస్తూ... పౌష్టికాహారం ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రహదారి సదుపాయం లేని గిరిశిఖరాలకు చెందిన గర్భిణులు, నిరుపేదలైన గర్భిణులకు వైద్యసేవలతో పాటు పోషకాహారం అందిస్తూ సుఖప్రసవాలను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం గర్భిణిల వసతి గృహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మెనూ చార్టుల్లో గొప్పలు చెప్పి.. ఆచరణలో అమలుచేయకపోవడం తగదన్నారు. ప్రసవ సమయంలో గర్భిణికి, కడుపులోని బిడ్డకు ఆరోగ్య సమస్యలొస్తే బాధ్యత వహించేదెవరని ప్రశ్నించారు. అమాయకులైన గిరిజన గర్భిణులు ఎవరిని ప్రశ్నించాలో తెలియక ఏది పెడితే దాంతో సరిపెట్టుకుంటున్నారన్నారు. దీనిపై కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ పీఓ స్పందించి గర్భిణిల వసతి గృహంలో మెనూ చార్టు పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట ఎంపీపీ దీనమయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, సర్పంచ్ బి.గౌరీశంకరరావు పాల్గొన్నారు.

తేలని 'లెక్కలు'..!



బకాయిలు చెల్లించాలని ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

- ఎన్నికలు ముగిసినా సరిచేయని అధికారులు
- బకాయిల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణ
- సగం మొత్తంతోనే సరిపెట్టుకోవాలని మెలిక

సాక్షి, పార్వతీపురం మన్యం:

రాష్ట్రంలో ఈ ఏడాది మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. జూన్ 4న ఫలితాలు వెలువడ్డాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరి అయిదు నెలలు పూర్తయిపోయింది. పార్వతీపురం మన్యం జిల్లాకు ఎన్నికల విధుల నిమిత్తం వచ్చిన అధికారులు ఎవరి జిల్లాలకు వారు తిరిగి వెళ్లిపోయారు. జిల్లాలో చాలా విభాగాల అధికారులూ మారిపోయారు. ఎన్నికల 'లెక్కలు' మాత్రం సరి చేయలేదు. నిధులు పెద్ద ఎత్తున వచ్చి, అంతా 'సర్దుబాటు' చేసేసుకున్నారు. అవి ఎవరి ఖాతాల్లోకి వెళ్లిపోయాయో కానీ, కొన్ని బకాయిలు అలానే ఉండిపోయాయి. దీంతో వారు నేటికీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్లకు రూ.లక్షల్లో బకాయి

కోడ్ మొదలు, ఎన్నికల ప్రక్రియ ముగిసినంత వరకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ సంబంధిత కార్యక్రమాలను ఫొటోలు, వీడియోల్లో చిత్రీకరించేందుకు కొంతమందిని తాత్కాలికంగా ఆయా అధికారులు నియమించుకున్నారు. వారు తమ సొంత కెమెరాలు ఉపయోగించి, కొన్నిన్ని రోజులు 24 గంటలూ అందుబాటులో ఉండి పని చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిపోయింది కానీ, ఇప్పటి వరకు వారి బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించలేదు. ఎన్నికల నిధుల నుంచి వీరికి మొత్తం అందించాల్సి ఉంది. జిల్లాలో దాదాపు రూ.33 లక్షల వరకు వారికి చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. కొంతమొత్తం చెల్లించి సరిపెట్టేశారు. మిగిలిన మొత్తం కోసం అడిగితే ఎవరి నుంచీ స్పందన రావడం లేదని బాధిత వీడియో, ఫొటోగ్రాఫర్లు వాపోతున్నారు. ఇలా రూ.10 లక్షలు ఇవ్వాల్సిన వారికి 50 శాతం చెల్లించి సరిపెట్టేశారు. పాలకొండకు చెందిన అన్నాజీరావు అనే వీడియోగ్రాఫర్‌కు రూ.5.30 లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. రూ.2 లక్షలు చెల్లించారు. మిగిలిన మొత్తం కోసం ఆయన ఎన్నిసార్లు తిరిగినా స్పందన రావడం లేదు. మరో వీడియోగ్రాఫర్‌కు రూ.3 లక్షలు ఇవ్వాల్సి ఉండగా..రూ.లక్ష చెల్లించి సరిపెట్టుకోవాలని చెబుతున్నారు. నాలుగు నియోజకవర్గాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ఇటీవల సాలూరు, పాలకొండ నియోజకవర్గాలకు చెందిన వీడియో, ఫొటోగ్రాఫర్లు అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. స్పష్టమైన హామీ రావడం లేదని వాపోతున్నారు.

ఎవరిని అడిగినా కానరాని ప్రయోజనం

ఎన్నికల సమయంలో ఉన్న తహసీల్దార్లు, ఆర్డీవోలు ఎవరూ ఇప్పుడు లేరు. ఇప్పుడున్న అధికారులను అడిగితే..ఆ 'లెక్కలు' తమకు తెలియవంటూ తప్పించుకుంటున్నారు. ఉన్నతాధికారులూ మారిపోయారు. వాస్తవానికి బకాయిల చెల్లింపు కోసం గతంలోనే రూ.2 కోట్ల వరకు నిధులు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ మొత్తం ఎవరి ఖాతాల్లోకి వెళ్లిపోయాయో..కొంతమొత్తం చెల్లించి, మిగిలిన బకాయిలను మరిచిపోవాలని చెప్పడమేమిటో అర్థం కావడం లేదని సదరు ఫొటోగ్రాఫర్లు వాపోతున్నారు.

క్లుప్తంగా

కాలిపోయి మహిళ మృతి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామానికి చెందిన సారికి సింహచలం(60) కాలిపోయి మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి సోమవారం తెలిపారు. సింహాచలం తన తమ్ముడు ఇంట్లో ఉంటోంది. ఆమెకు చుట్ట అలవాటు ఉంది. నిద్రపోతున్న సమయంలో కాల్చిన చుట్ట ఆమె చీరకు అంటుకుంది. ఆ విషయం గమనించకపోవడంతో నిద్రలో ఆమె శరీరం కాలిపోయింది. ఉదయం నాలుగు గంటల సమయంలో చూసిన కుటుంబసభ్యులు వెంటనే 108లో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఐటీడీఏ గ్రీవెన్స్‌సెల్‌కు 46 వినతులు



గ్రీవెన్స్‌సెల్‌లో వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 46 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఇప్పగూడ గ్రామానికి చెందిన సవర రమేష్ మేకల లోన్ మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. అలాగే వీరఘట్టానికి చెందిన మరడాన శాంతికుమారి భాషా వలంటీర్ ఉద్యోగం ఇప్పించాలని, ఇరపాడుకు చెందిన మోహన్‌రావు పవర్ టిల్లర్ కావాలని కోరారు. విద్యుత్ స్తంభాలు గ్రామంలో వేయించాలని పుబ్బాడ గ్రామస్తులు అర్జీ అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఇసుకతవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు దావల రమణరావు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాలు లేకుండా చర్యలు తీసుకోండి

- డీఎంహెచ్ఓ డాక్టర్ రాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రాణి

విజయనగరం ఫోర్ట్: మాతృ, శిశు మరణాలు జిల్లాలో సంభవించకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.రాణి అన్నారు. ఈ మేరకు ఈఏడాది జూలై నుంచి అక్టోబర్ నెలవరకు జరిగిన ఏడు మాతృ, 12 శిశు మరణాలపై స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలు పునరావృతం కాకుండా గర్భిణులను ఆస్పత్రికి తరలించి, ప్రసవమయ్యే వరకు పర్యవేక్షించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఐఓ అచ్యుతకుమారి, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ రజనీకుమారి, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కిశోర్‌కుమార్, డీపీహెచ్ఎన్ఓ మామిడి సత్యవతి, డెమో చిన్నతల్లి, హెచ్ఈఈఓ పి. రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం తగదు

- డీవైఎఫ్ఐ విజ్ఞప్తి

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వివిధ రకాల కారణాల చెప్పి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేయడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్.హరీష్ సోమవారం ఒక ప్రకటనలో అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగాల కోసం, మార్పు కోసం రాష్ట్రంలోని నిరుద్యోగులు గంపగుత్తగా కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించడంలో కీలకపాత్ర వహించారన్నా రు.తదనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు డీఎస్సీపై మొదటి సంతకం చేశారు కానీ నాలుగు నెలలవుతున్నా నోటిఫికేషన్ రాలేదన్నారు. అదిగో,ఇదిగో డీఎస్సీ నోటిఫికేషన్ అని ఊరిస్తున్నారు కానీ ఇప్పటికీ నోటిఫికేషన్ రావడం లేదన్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ కారణంగా మళ్లీ నోటిఫికేషన్ విడుదల కాదేమో అని నిరుద్యోగుల్లో భయాందోళన మొదలైందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం సంవత్సరాల తరబడి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటూ ఉన్నారన్నారు. ప్రభుత్వం వారి సమస్యను గుర్తించి డీఎస్సీ నోటిఫికేషన్ పై క్లారిటీ ఇచ్చి నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేయకుండా చూడాలని విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹224	₹234

ఊపిరితిత్తులు జాగ్రత్త..!

- పెరుగుతున్న నిమోనియా కేసులు
- చలికాలంలో వ్యాధి వ్యాప్తి అధికం
- నేడు ప్రపంచ నిమోనియా డే





సర్వజన ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: నిమోనియా(నిమ్ము) వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే మృత్యువాతపడే ప్రమాదముంది. నిమోనియాని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా బయట పడవచ్చు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగా నిమోనియా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధిలో వైరస్, బాక్టీరియా, ఫంగల్ రకాలు ఉన్నాయి. క్షయవ్యాధి కూడా ఈ వ్యాధిలో ఒకరకమే. మంగళవారం ప్రపంచ నిమోనియాడే సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. రోజురోజుకు నియోనియో ,వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. చల్లటి వాతావరణం ఉన్నప్పుడు ఈవ్యాధి ఎక్కువగా వ్యాప్తిచెందే ఆస్కారముంది. నెలలో 400 నుంచి 500 వరకు నిమోనియో కేసులు సమోదువుతున్నాయి.

ప్రాణాంతకమైన 10 వ్యాధుల జాబితాలో నియోనియా వ్యాధి కూడా ఉంది.

వ్యాధి లక్షణాలు

ఛాతిలో నొప్పి, దగ్గు, ఆయాసం, నోటి నుంచి రక్తం పడడం వ్యాధి లక్షణాలు. నిమోనియా చిన్న వయసులోని పిల్లల నుంచి ఏ వయసు వారికైనా సోకవచ్చు. చలికాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. డయాలసిస్ రోగులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి, హెచ్ఐవీ రోగులు, చిన్న పిల్లలు, పొగ, మద్యం తాగేవారికి ఎక్కువగా వ్యాధి సోకే పరిస్థితులు ఉన్నాయి. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది.

నిర్ధారణ ఇలా..

చెస్ట్ ఎక్స్‌రే ద్వారా నిమోనియాను నిర్ధారిస్తారు. అప్పటికి కూడా వ్యాధి నిర్ధారణ పూర్తిస్థాయిలో కాకపోతే సిటీచెస్ట్‌స్కాన్ తీసి నిర్ధారణ చేస్తారు.

జాగ్రత్తలు

నిమోనియో, ఆస్తమా ఉన్న వారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతికి వస్త్రం అడ్డం పెట్టుకోవాలి. నిమోనియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యున్ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. కాలుష్యం ఉండే ప్రాంతాల్లో తిరగకూడదు. త్వరగా నిద్రపోవాలి. మధుమేహవ్యాధిని నియంత్రణలో ఉంచుకోవాలి. కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాలు, పాలు, గుడ్డు ప్రతిరోజూ తీసుకోవాలి. స్వీట్స్, మైదా, గోధుమలు, అన్నం తక్కువగా తీసుకోవాలి.

అలసత్వం వద్దు



నిమోనియా లక్షణాలు కనిపించిన వెంటనే అలసత్వం వహించకుండా వైద్యుడిని సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. మద్యం, పొగ తాగడం మానివేయాలి.చిన్న పిల్లలు, పెద్ద వారు నియోనియాకు వ్యాక్సిన్ వేయించుకోవాలి. నిమోనియా రాకుండా న్యూమోకోలర్, ఇన్‌ఫ్లూ యాంజా వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఎదో ఒక వేయించుకుంటే వ్యాధి బారిన పడకుండా ఉంటారు.

డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్,
పలమనాలజిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

100 రోజుల ప్రగతిపై నివేదికలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై కచ్చితమైన నివేదికలను రెండు రోజుల్లోగా సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కార్యాచరణ ప్రణాళిక ప్రగతిపై కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ప్రగతిని పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యాన, గృహనిర్మాణం, బిందు తుంపర సేద్యం తదితర శాఖల ప్రగతిపై ఆరా తీశారు. బుధవారం నాటికి సమగ్ర నివేదికలను అందజేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సీఈఓ పి.బాలాజీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

13 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం 13 కిలోల గంజాయిని స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో ఫ్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తుండగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వికాస్ వర్మ, సతీష్‌కుమార్ పాల్‌లు నిషేధిత గంజాయి రవాణా చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 65వేల విలువైన 13 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని చెప్పారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వేస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన రెడ్డి జగన్నాథం(49) ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఏఎస్సై సన్యాసిరావు తెలిపిన వివరాల ప్రకారం చెడు వ్యసనాలకు బానిసైన జగన్నాథం భార్య వాణి భర్తను విడిచిపెట్టి పుట్టింటికి వెళ్లిపోయింది.రెండు నెలలైనా భార్య ఇంటికి రాకపోవడం, ఒంటరిగా ఉన్నానన్న మనస్తాపంతో జగన్నాథం ఆదివారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోసుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఏఎస్సై చెప్పారు.

బైక్‌లు, సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాంబాబు, తదితరులు

పాలకొండ: పాలకొండ ప్రాంతంలో పలు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ ఎం రాంబాబు విలేకరులకు వివరించారు. సీతంపేట మండలంలోని ఈతమానుగూడకు చెందిన సవర సింహాచలం కొంత కాలంగా ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్‌లు దొంగతనం చేస్తున్నాడు. ముందుగా సీసీ కెమెరాలు లేని చోటును ఎంచుకుని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. కొత్త వ్యక్తులను పరిచయం చేసుకుని వారితో మాటలు కలిపి వారిని మోసగించి సెల్‌ఫోన్‌లు తీసుకుపోవడంలో దిట్ట అని డీఎస్పీ తెలిపారు. నిందితుడు సింహాచలంపై జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదై ఉండడంతో నిఘా ఏర్పాటు చేసి మండలంలోని సింగన్నవలస సెంటర్ వద్ద అదుపులోనికి తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిందితుడి దగ్గర నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రెండు పశువుల శాలలు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సంతకవిటి: మండలంలోని ముకుందపురం గ్రామానికి చెందిన గడే సంతోష్‌కుమార్ పశువుల శాల, 2 ఎకరాల గడ్డివాము దగ్ధమైనట్లు రాజాం ఫైర్ సిబ్బంది వెల్లడించారు. కార్తీక మాసం సందర్భంగా వెలిగించిన దీపం ఒత్తిని పక్షులు తీసుకువచ్చి గడ్డి వాముపై వేయడంవల్ల గడ్డి వాము, పక్కనే ఉన్న రెండు పశువుల శాలలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం మేరకు గ్రామానికి వచ్చి మంటు అదుపు చేసిన సిబ్బంది సుమారు రూ.50వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనాగా వెల్లడించారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా తయారీకి ఉపయోగించే సామగ్రి

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామం సమీపంలో కొండవాగు వద్ద సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల పులిసిన బెల్లం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రామారావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. ఈ మేరకు ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గ్రామానికి సమీపంలో గల కొండవాగు ప్రాంతంలో సారా తయారీకి బెల్లం ఊటను మూడు ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వ ఉంచడం గమనించి ధ్వంసం చేశారు. అలాగే సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, అమ్మకాలు జరిపితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశామని ఎస్సై హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది రాంబాబు, రాము, నాయుడు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో పరిస్థితులపై జేసీ ఆరా



హాస్టల్‌లో వంటగది పరిసరాలను పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: నగరంలోని మహారాణిపేట బీసీ బాలుర వసతి గృహాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారికి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. వంటగదిని పరిశీలించి పరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. హాస్టల్ సంక్షేమ అధికారి జానకీరావు, వంటవారితో మాట్లాడి విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత పాటిస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పరిశుభ్ర వాతావరణంలో వండించి ఇవ్వాలని జేసీ ఈ సందర్భంగా హాస్టల్ సంక్షేమాధికారిని ఆదేశించారు. మెనూ ప్రకారం ఆహారం అందించకపోతే తమకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఇటీవల ఈ హాస్టల్‌లో ఉంటున్న 7వ తరగతి విద్యార్థి కొనతాల శ్యామలరావు అస్వస్థతకు గురై మరణించిన నేపథ్యంలో హాస్టల్‌లో పరిస్థితులను తెలుసుకునే నిమిత్తం జాయింట్ కలెక్టర్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. జేసీ పర్యటనలో బీసీ సంక్షేమాధికారి పెంటోజీరావు కూడా ఉన్నారు.

వాలీబాల్ విజేతలు కడప, శ్రీకాకుళం



మూడో స్థానంలో నిలిచిన విజయనగరం బాలుర జట్టు



కడప బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

- విజేతలకు ట్రోఫీల ప్రదానం
- ముగిసిన స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలు

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా మూడు రోజుల పాటు సాగిన బాల, బాలికల 68వ అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో కడప, శ్రీకాకుళం జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా నిర్వహించిన పోటీలు సోమవారంతో ముగిశాయి. జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు అధ్వర్యంలో నిర్వహించిన పోటీలను డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు పర్యవేక్షించారు.

హోరాహోరీగా..

మూడో రోజు అండర్-14 బాలబాలికల వాలీబాల్ ఫైనల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. బాలుర విభాగంలో శ్రీకాకుళం- విశాఖపట్నం, బాలికల విభాగంలో కడప-గుంటూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్స్‌లో బాలుర విభాగంలో శ్రీకాకుళం, బాలికల విభాగంలో కడప జట్లు గెలుపొంది రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచాయి. ఈ పోటీలకు ఆతిథ్యం ఇచ్చిన విజయనగరం జట్టు బాలుర విభాగంలో మూడో స్థానంలో నిలిచింది.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

పోటీల అనంతరం వివిధ జిల్లాల జట్ల తరపున పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన బాలబాలికలను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వారు ఆంధ్రప్రదేశ్ అండర్-14 వాలీబాల్ బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు.

బాలుర జట్టు

రాష్ట్ర బాలుర జట్టుకు కె.వినయ్‌కుమార్, బి.కృష్ణ, కె.యువరాజ్‌శేఖర్ (శ్రీకాకుళం), డి.భానునీలమ్, పి.రాముడు(విశాఖపట్నం), ఎం.సంతు, వి.రాఘవేంద్ర(విజయనగరం), పి.నవీన్‌కుమార్ (వెస్ట్‌గోదావరి), పి.రాజు(చిత్తూరు), ఎస్.గోవర్ధన్‌నాయక్ (అనంతపురం), జె.మల్లేష్ (ఈస్ట్‌గోదావరి), కె.శ్రీరామ్(గుంటూరు) ఎంపికయ్యారు.

బాలికల జట్టు

రాష్ట్ర బాలికల జట్టుకు టి.భువనేశ్వరి, బి.భార్గవి, ఎన్.నాగతనూజ(కడప), కె.నందు (గుంటూరు), కె.దేవి(ఈస్ట్ గోదావరి), ఎం.మహాలక్ష్మి, కె.మహాశ్రీలక్ష్మి (వెస్ట్‌గోదావరి), బి.కాస్మిత (విశాఖపట్నం), కె.వాసు(చిత్తూరు), జి.రేవతి (విజయనగరం), పి.మానస (శ్రీకాకుళం) ఎంపికయ్యారు. జాతీయస్థాయి జట్ల ఎంపికతో భోగాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలు ముగిసినట్లు రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ భగవాన్‌దాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీఏఎన్ రాజు, ఎంఈఓ చంద్రమౌళి, వ్యాయామ ఉపాధ్యాయుడు సింగిడి నాగన్న తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

పని ఎక్కువ..ఫలితం తక్కువ..!

- 20 ఏళ్లు గడుస్తున్నా రూ.5000 వేతనమే
- ఆదివాసీ విద్యావలంటీర్లపై ప్రభుత్వం చిన్నచూపు
- క్రమబద్ధీకరణకు నోచుకోని విద్యా వలంటీర్లు
- ఎన్నికల ముందు క్రమబద్ధీకరిస్తామని చంద్రబాబు హామీ
- ప్రస్తుతం పట్టించుకోని ప్రభుత్వం




పార్వతీపురం ఐటీడీఏ వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీ మాతృ భాషా వలంటీర్లు (ఫైల్)

పార్వతీపురంటౌన్: కొండశివారు ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా బడిబయట కనిపించడంతో అప్పటి ఐటీడీఏ పీఓ..అక్షర క్రాంతి కళాజాతా బృందం పేరుతో సర్వే చేపట్టారు. ఆ సర్వేలో పిల్లలు తెలుగు భాషపై ఆసక్తి చూపకపోవడంతో 2002లో అప్పటి పీఓ సవరభాషా విద్యా వలంటీర్లను నియమించారు. అందుకోసం ఐటీడీఏ నిధులు కేటాయించి, అప్పట్లో రూ.వెయ్యి వరకు వేతనం ఇచ్చేవారు. ముందుగా ఐటీడీఏ పరిధిలో 20 పాఠశాలలతో ప్రారంభించి సవర భాషలో విద్యను బోధించడంతో విద్యార్థులు ఆసక్తి చూపారు. ప్రాథమిక పాఠశాలల్లో తమ భాషలో విద్యార్థులకు విజ్ఞానాన్ని నేర్పిస్తూ పునాది వేసుకుంటూ వారి విద్యాభివృద్ధికి విద్యావలంటీర్లు తోడ్పడుతున్నారు. దీంతో మిగతా పాఠశాలల్లోనూ సవర భాషా వలంటీర్లను నియమించారు. ప్రస్తుతం పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 176 సీతంపేట ఐటీడీఏ పరిధిలో 152మంది పాఠశాలల్లో విద్యా వలంటీర్లు పనిచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ సవర భాషా విద్యా వలంటీర్లు ఉంటూ విద్యార్థులకు వారి భాషలో విద్యాబోధన చేస్తారు. జిల్లాలో గల గిరిశిఖర గ్రామాల్లో గల పాఠశాలల్లో ఆదివాసీ ఒరియాలో బోధన చేస్తుంటారు. దీనివల్ల ఆదివాసీ ప్రాంతాల్లో చిన్నారులు చదువుపై ఆసక్తి చూపుతున్నారు.

ఐదు నెలలు గడుస్తున్నా నోరు మెదపని కూటమి ప్రభుత్వం

ఇప్పటికి సుమారు 22 ఏళ్లుగా సవరభాషా వలంటీర్లు విద్యార్థులకు బోధిస్తున్నారు. ఉదయం తొమ్మిదిగంటల నుంచి సాయంత్రం వరకు అన్ని సబ్జెక్టులు బోధిస్తున్నారు. అలాంటి ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వలంటీర్లను రెగ్యులర్ చేయాలని, లేకుంటే సీఆర్‌టీల మాదిరిగా టైంస్కేల్ ప్రకటించాలని పలుమార్లు మంత్రులు, అధికారులకు, గ్రీవెన్స్‌సెల్ లో వినతులు అందిస్తున్నారు. జీతాలు చాలడం లేదని వంటావార్పు, ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలు చేశారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనికరించలేదు. గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడికి అరకు బహిరంగ సభలో వినతులిచ్చారు. యువగళం పాదయాత్రలో భాగంగా పాయకరావుపేటలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, అధికారంలోకి వస్తే ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నోరు మెదపడం లేదు..

తక్షణమే రెగ్యులర్ చేయాలి



ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ఆదివాసీ విద్యా వలంటీర్లను తక్షణమే రెగ్యులర్ చేయాలి. రూ.5 వేల వేతనంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. ఒడిశా రాష్ట్రం మాదిరిగా సవర భాషా వలంటీర్లను రెగ్యులర్ చేయాలి. లేదంటే సీఆర్‌టీల మాదిరిగా టైం స్కేల్ ప్రకటించాలి. రాష్ట్ర విద్యాశాఖలో విలీనం చేయాలి. 12 నెలలూ జీతాలు చెల్లించాలి.

– దుంబు, ఆదివాసి మాతృ భాష వలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి

చాలీచాలని జీతంతో ఇబ్బందులు



చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతున్నాం. మాకు ఎన్నికల ముందు రెగ్యులర్ చేస్తామని హామీఇచ్చారు. ఐదు నెలలు గడుస్తున్నా ఎటువంటి స్పందన లేదు. విద్యార్థుల కోసం ఎంతో కష్టపడుతున్నాం. నెల నెలా జీతాలు చెల్లించాలి. రూ.5 వేలు వేతనం రవాణా చార్జీలకే చాలడం లేదు. జీతాలు పెంచాలి. క్రమబద్ధీకరణ చేయాలి. వీటిపై అధికారులకు, పాలకులకు వినతులు అందించాం.

బి.వెంకటేష్,
ఆదివాసీ మాతృ భాషా వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

విద్యా వలంటీర్లకు భరోసా కల్పించాలి

ఆదివాసీ విద్యా వలంటీర్లకు ప్రభుత్వం భరోసా కల్పించాలి. రూ. 5వేల వేతనంతో ఆర్థికంగా ఇబ్బందుతున్నారు. వారి రవాణా ఖర్చులకు సరిపోవడంలేదు. ఇతర రాష్ట్రంలో మాదిరిగా రెగ్యులర్ చేయాలి. ప్రతి నెలా వేతనం వచ్చేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం వారికి పూర్తి ఆర్థిక భరోసా కల్పించాలి.

– ఎస్. మురళి,
యూటీఎఫ్, నాయకుడు